సర్వం సిద్ధం

- నేడే సార్వత్రిక ఎన్నికల పండగ
- 'ఉత్తర'లోని 275 పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి
- ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారుల చర్యలు


అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు

ఉత్తర నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు :	2,85,789
పురుషులు :	1,40,788
మహిళలు :	1,44,979
ఇతరులు :	22
పోలింగ్ కేంద్రాలు :	275
ప్రిసైడింగ్ అధికారులు :	275
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు :	275
పోలింగ్ సిబ్బంది :	825
రిజర్వ్ సిబ్బంది :	10 శాతం
సెక్టార్ అధికారులు :	17
సూపర్‌వైజర్లు :	17
బీఎల్వోలు :	275


సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్‌ఎంసీ హైస్కూల్ ఆవరణలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు


పోలింగ్ బూత్ వద్ద సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ వద్ద పోలీస్ బందోబస్తు

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. ఓటింగ్ పర్వానికి ఉత్తర నియోజకవర్గంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా.. ప్రశాంతంగా జరిగేందుకు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) డి.అఖిల అన్ని రకాల చర్యలు పకడ్బందీగా తీసుకున్నారు. నియోజకవర్గంలోని 275 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఓటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు, సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టారు. గతంలో గొడవలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ..

నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో 1:4 నిష్పత్తిలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, మరో ముగ్గురు సిబ్బంది చొప్పున నియమించారు. భద్రతా సిబ్బందితో కలిపి ప్రతి బూత్‌లో 10 నుంచి 15 మంది విధుల్లో ఉంటారు. వీరిని ఆర్వో, ఏఆర్వో, 17 మంది సెక్టార్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారు. ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని సీసీ కెమెరాలు, వెబ్ కెమెరా, వీడియో కెమెరాల్లో చిత్రీకరిస్తారు. ఎన్నికల తీరును ఆర్వో, ఏఆర్వోలు లైవ్ వీడియో ద్వారా రిటర్నింగ్ కార్యాలయాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

పోలింగ్ బూత్‌లోకి ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదని, ప్రిసైడింగ్ ఆఫీసర్ ఒక్కరి వద్దే సెల్‌ఫోన్ ఉంటుందని, అది కూడా స్విచ్చాఫ్ చేసి ఉండాలని ఆర్వో తెలిపారు.

ఇవీ సదుపాయాలు

ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఆయా పీఎస్‌ల నంబర్లు, సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు రాసి ఉంచారు. ఎన్నికల విధులకు అవసరమైన ఫర్నిచర్, కరెంట్, వాటర్, టాయిలెట్లు, ఫస్ట్ ఎయిడ్ సదుపాయం కల్పించారు. ఓటర్లు కూర్చోడానికి కుర్చీలు, ప్రతి బూత్ వద్ద నీడ కల్పించడానికి టెంట్లు వేశారు. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు వీలుగా ర్యాంప్‌లు, వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మద్రిపాలెం: ఆర్ అండ్ బీ జంక్షన్ శ్రీరాంనగర్ దరి ఆర్టీవో నంబర్ ప్లేట్ కేంద్రం వద్ద ఉన్న పోలింగ్ బూత్‌ను ఆదివారం వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందిని పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు సుమారు 200 మీటర్ల వరకు ఇతరులను అనుమతించవద్దని సిబ్బందికి ఆయన సూచించారు. ఓటర్లు సైతం పోలింగ్ కేంద్రాలకు తమ సెల్‌ఫోన్లను తీసుకురావద్దని కోరారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే జీవీఎంసీ అధికారులు పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించారు.

వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలు

వార్డు నం.	పోలింగ్ బూత్ నంబర్లు
14	159, 160, 169, 175 నుంచి 186 వరకు
23	164, 165
24	145, 146, 147, 150, 156, 157, 158, 161, 162, 163, 166, 167, 168, 170 నుంచి 174 వరకు
25	115, 116, 133, 134, 135, 136, 139 నుంచి 144, 148, 149, 151 నుంచి 155
26	96, 97, 98, 103 నుంచి 114, 117, 118, 122, 127, 137, 138
42	54, 57, 68, 71, 72, 120, 121, 128, 129
43	70, 73 నుంచి 77, 86, 87, 88, 93, 99. 100, 101, 102, 119, 130, 131, 132
44	66, 67, 69, 78, 79, 80 నుంచి 85, 89, 90, 91,94, 95, 123, 125
45	58, 59, 60, 61, 124, 126, 192, 193, 194, 195
46	43, 56, 187 నుంచి 191, 196, 197, 198, 199, 200
47	44, 45, 46, 201 నుంచి 210, 213, 214
48	17, 18, 31, 211, 212, 215 నుంచి 222, 229
49	21 నుంచి 26, 36 నుంచి 39, 41, 42, 223 నుంచి 228, 246, 247
50	34, 35, 230 నుంచి 238, 244, 249, 250, 251, 272
51	239, 240, 241, 242, 243, 248, 252, 262 నుంచి 271
53	7, 12(13), 14, 16, 253 నుంచి 261 వరకు
54	1 నుంచి 6, 8 నుంచి 11(13), 15, 29, 30, 32, 33, 40, 245
55	19, 20, 27, 28, 47 నుంచి 53, 55, 62, 63, 64, 65, 92 వరకు.

అసెంబ్లీ బరిలో నిలిచింది వీరే..

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ బరిలో 15 మంది అభ్యర్థులు నిలవగా.. వారిలో ఇద్దరు ప్రత్యర్థి పార్టీలకు మద్దతు తెలిపి పోటీ నుంచి తప్పుకోవడంతో 13 మంది మిగిలారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో కె.కె.రాజు(వైఎస్సార్‌సీపీ – ఫ్యాన్ గుర్తు), పి.విష్ణుకుమార్‌రాజు(బీజేపీ – కమలం), రామారావు లంకరాజు(కాంగ్రెస్ – హస్తం), వి.వి.లక్ష్మీనారాయణ(జై భారత్ నేషనల్ పార్టీ – బ్యాటరీ టార్చ్), పెద్దాడ కనకమహాలక్ష్మి (బహుజన్ సమాజ్ పార్టీ – ఏనుగు), పి.జగదీష్(జాతీయ జనసేన పార్టీ – పెన్ను స్టాండ్), చింతాడ సూర్యం (నవభారత్ నిర్మాణ్ సేవా పార్టీ – టెలివిజన్), కోనేటి ఈశ్వర వీరభద్రాచారి(ఇండిపెండెంట్ – ఉంగరం), చప్పా రామునాయుడు(ఇండిపెండెంట్ – బకెట్), బొడ్డు వరాహ సత్యశ్రీనివాస్(ఇండిపెండెంట్ – విజిల్), బొర్రా రమేష్(ఇండిపెండెంట్ గ్యాస్ – సిలిండర్), రోణింకి చలపతిరావు(ఇండిపెండెంట్ – వజ్రం), యలమంచిల సాహితి(ఇండిపెండెంట్ – మైక్) పోటీ పడుతున్నారు. గుంపల శరత్‌బాబు(సమాజ్‌వాది పార్టీ), వడ్డీ శిరీష(ఇండిపెండెంట్) బరిలో లేరు.


నాడు: 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో అభివృద్ధికి నోచుకోని జీవీఎంసీ ఉర్దూ స్కూల్


నేడు: అద్భుతంగా రూపురేఖలు మారిన జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

వివేకంతో ఓటేయండి

- సంక్షేమాభివృద్ధి, సుపరిపాలనకా.. ప్రజలను పట్టించుకోని ప్రబుద్ధుడికా...
- ఒక్కసారి ఆలోచించండి.. మంచి నేతను ఎన్నుకోండి


నాడు: అరకొర సదుపాయాలతో ఆరోగ్య కేంద్రం


నాడు: జీవీఎంసీ 51వ వార్డులో అధ్వానంగా మాధవధార ప్రధాన రహదారి


నేడు: కప్పరాడలో రూ.2.36 కోట్లతో నిర్మించిన ఆధునిక ఆరోగ్య కేంద్రం


నేడు: అద్దంలా మెరిసిపోతున్న ప్రధాన రహదారి

సీతంపేట: ప్రజల భవితను.. రాజకీయ నాయకుల తలరాతను మార్చే ఓట్ల పండగ రానే వచ్చింది. సోమవారం(నేడు) సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. తమను ఐదేళ్ల పాటు పాలించే మంచి నాయకుడిని ప్రజలు ఎన్నుకునే సమయం ఆసన్నమైంది. ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల బరిలో 13 మంది నిలువగా(15 మందికి ఇద్దరు తప్పుకున్నారు).. ప్రధానంగా రెండు పార్టీల అభ్యర్థులు నువ్వానేనా అంటూ పోటీ పడుతున్నారు. వారిలో ఒకరు వైఎస్సార్‌సీపీ నుంచి కె.కె.రాజు.. మరొకరు బీజేపీ(టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి) నుంచి పి.విష్ణుకుమార్‌రాజు. ప్రజ లు ఆలోచించి.. తమకు మేలు చేసే నాయకుడికి ఓటేసి ఎమ్మెల్యేగా ఎన్నుకునే అవకాశం వచ్చింది.

గడిచిన ఐదేళ్లలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచింది. ఆర్థికంగా భరోసానిచ్చింది. ఎందరికో చేయూతనందించింది. డిజిటల్ విద్యను, మోడ్రన్ స్కూళ్లను తీసుకొచ్చింది. సంక్షేమ పథకాలను, వైద్యాన్ని పేదల చెంతకు చేర్చింది. పింఛన్‌ను ఇంటికే తెచ్చి లబ్ధిదారుల చేతిలో పెట్టి అందరి మన్ననలు పొందింది. లెక్కలేనన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజలకు ఎంతో ఎంతెంతో మేలు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనతోనే ఇదంతా సాధ్యమైంది.

ఉత్తర నియోజకవర్గంలో ఐదేళ్లలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. ఎంతలా అంటే 2019కి ముందు.. ఆ తర్వాత అని బేరీజు వేసుకునేంతగా. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పాలనలో విద్య, వైద్య, మౌలిక వసతుల రంగాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక విద్య, వైద్య రంగాలు, మౌలిక వసతుల కల్పనలో మునుపెన్నడూ చూడని అభివృద్ధితో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేశారు. 2019 ఎన్నికల్లో ఓడాక విష్ణుకుమార్‌రాజు తెరమరుగై.. 2024 ఎన్నికలు రాగానే మళ్లీ ప్రత్యక్షమయ్యారు. ఈ తరుణంలో సంక్షేమాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తికా.. లేదా ప్రజలను పట్టించుకోని ప్రబుద్ధుడికి ఓటేయాలా.. అని ప్రజలు ఒక్కసారి వివేకంతో ఆలోచించి.. ఎటువంటి అభివృద్ధి కావాలో బేరీజు వేసుకోవాలి.


నాడు: నెహ్రూనగర్‌లో బర్మా కాందిశీకుల ఇళ్ల పరిస్థితి


నేడు: 49వ వార్డు నెహ్రూనగర్‌లో రూ.1 కోటితో ఆధునికీకరించిన బర్మా కాందిశీకుల గృహ సముదాయం

ఎస్‌బీఐ మహిళా ఉద్యోగుల సేవా దృక్పథం

సీతమ్మధార: ఎస్‌బీఐ మహిళా క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ఎస్‌ఎంసీ హైస్కూల్‌కు ఒక కంప్యూటర్, 12 చైర్లు, బుక్స్, 45 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం లాంగ్ బుక్స్‌ను సేవా దృక్పథంతో హెచ్‌ఎం డి.రాంప్రసాద్‌కు అందజేశారు. పేద పిల్లలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఉద్యోగులు తెలిపారు. క్లబ్ సభ్యులకు హెచ్‌ఎం రాంప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన జనరల్ మేనేజర్, అమరావతి సర్కిల్ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ మంజుశర్మ, ఎస్‌బీ జోనల్ ఆఫీస్ మహిళా సిబ్బంది, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


ఎస్‌ఎంసీ హైస్కూల్‌కు కంప్యూటర్, చైర్లు అందిస్తున్న ఎస్‌బీఐ మహిళా ఉద్యోగులు

చెంతనే వైద్య శిబిరాలు

మహారాణిపేట: ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఏ విధమైన అనారోగ్య సమస్యకు గురైనా దగ్గరలో ఉన్న మెడికల్ క్యాంప్‌లో సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం కార్యాలయంలో అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట భద్రత

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలోని ఉద్యోగులు, పోలీసులు, వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్ద నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ పత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్ర పరిచారు. ఉత్తర రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిల ఆధ్వర్యంలో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో బ్యాలెట్ ఓట్లను ఉంచి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఆ గది వైపు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపిస్తూ వెంటనే పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక కేంద్రంలో మాతృ దినోత్సవం


శశికళను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక కేంద్రంలో బి.కె.శశికళ ఆధ్వర్యంలో ఆదివారం మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రపంచంలోని అన్ని బంధాల కంటే మాతృ బంధం మధురమైనదని, మాతృమూర్తి తన పిల్లలకు జన్మనిచ్చి మరో జన్మ పొందుతుందని పలువురు వక్తలు తల్లి గొప్పతనంపై మాట్లాడారు. ఈ సందర్భంగా శశికళను బ్రహ్మకుమారీలు సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.దేవయాని, అసిస్టెంట్ కమిషనర్, కస్టమ్స్ అండ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్, డాక్టర్ జి.నాగ సుధాలక్ష్మి, గైనకాలజిస్ట్ కె.భారతి, వాసవీ క్లబ్, జాయింట్ ట్రెజరర్, బ్రహ్మకుమారీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఘనంగా వేడుకలు


ఆశ్రమంలో మహిళను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు సేవ చేస్తూ కమ్మని ఆహార పదార్థాలు వండి పెడుతున్న మహిళను సత్కరించి చీర, నగదు బహుమతిగా అందించారు. క్లబ్ కార్యదర్శి జయ, కోశాధికారి షీలారాణి, పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ సేవా నిరతి


వృద్ధురాలికి చీర, పండ్లు అందిస్తున్న రంగారావు

మురళీనగర్: మాతృ దినోత్సవంలో భాగంగా మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మురళీనగర్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి అధ్యక్షతన ముఖ్య అతిథి వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ టి.రంగారావు చేతుల మీదుగా 18 మంది మహిళలకు చీరలు, పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. జనరేషన్ యువలో ఆశ్రయం పొందుతున్న వారికి వాటర్ బాటిళ్లు, శీతల పానీయాలు అందించారు. 101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షులు సిహెచ్.వరలక్ష్మి, టి.లీలానాయుడు, కోశాధికారి పి.కమల పాల్గొన్నారు.